ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

అనంతపురం, రాప్తాడు, శింగనమల	:9985411608
తాడిపత్రి,	: 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ,	: 9985411657,
కళ్యాణదుర్గం,	:9701120019,
రాయదుర్గం,	: 9000406723,

ఏసీఎం: 9985411154

ఆపేదెవరు?



గుంతకల్లులో ఆగని వైసీపీ భూకబ్జాలు

ఆక్రమించిన స్థలాల్లో నిర్మాణాలు

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ పట్టాలు



గుంతకల్లు, జూన్ 23: పట్టణంలోని దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో వైసీపీ నాయకుల కబ్జా పర్వం కొనసాగుతోంది. ఎన్నికల తర్వాత అధికారం మారిన నేపథ్యంలో ఉన్న స్థలాలు చేజారిపోతాయన్న భయంతో బేస్‌మెంట్ల నిర్మాణాన్ని జోరుగా చేపట్టారు. ఖాళీగా ఉన్న స్థలాలను, ఆసుపత్రి కోసం రిజర్వు చేసిన స్థలాన్ని, వంక స్థలంలో లేఅవుట్ వేసి, 40 అడుగుల రోడ్డులో 20 అడుగులు కబ్జా చేసి పునాదులను వేసేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలు పెడితే పార్టీకి చెడ్డపేరు వస్తుందని, అటువంటి పనులు చేయరాదంటూ స్థానిక ఎమ్మెల్యే వాట్సాప్ మాధ్యమంగా మెసేజీలు పెడుతున్నారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం ఖాళీ స్థలాల్లో పాగా వేసే కార్యక్రమాన్ని నిరాటంకంగా సాగిస్తున్నారు.

రిజర్వు సైట్‌ను ఆక్రమించి..

ఇందిరమ్మ లేఅవుట్ వెనుక నిర్మాణంలో ఉన్న టిడ్కో అపార్టుమెంట్ల వద్ద ఆసుపత్రి కోసమని కొంత స్థలాన్ని రిజర్వు చేశారు. వైసీపీ హయాంలో ఈ స్థలాన్ని కొందరు నాయకులు ఆక్రమించి అమ్ముకున్నారు. వాటిలో కొందరు ఇళ్లను, మరికొందరు బేస్‌మెంట్లను నిర్మించారు. ఆ సమయంలోనే రిజర్వు సైట్‌లో అక్రమ నిర్మాణాలు చేయరాదంటూ మున్సిపల్ అధికారులు కొందరికి నోటీసులను జారీ చేశారు. అయితే వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. మీరు కట్టుకోండి మేమున్నామంటూ వైసీపీ నాయకులు భరోసాను ఇచ్చి ఇళ్లను నిర్మింపజేశారు. ఇంకా మిగిలి ఉన్న ఖాళీ స్థలాల్లో బేసుమట్టాలను కట్టకపోతే అవి దక్కవన్న ఉద్దేశ్యంతో తాజాగా ఆరు ప్లాట్లలో బేసుమట్టాలను నిర్మించ డానికి పూనుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆర్ఐ, వీఆర్వోలు ఇక్కడకు వచ్చి నిర్మాణ పనులను ఆపించారు. స్థలాలకు సంబంధించి వారి వద్ద ఉన్న రికార్డులను తీసుకుని రెవెన్యూ కార్యాలయానికి రావాలని ఆదేశించారు.



వంకను ఆక్రమించి వేసిన లేఔట్‌లో వేసిన బేస్‌మెంట్లు

స్థలాలు ఆక్రమించరాదంటూ ఎమ్మెల్యే హెచ్చరికలు

టీడీపీకి చెందిన వారెవరూ స్థలాలను ఆక్రమించరాదంటూ స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పార్టీ శ్రేణులను కట్టడి చేస్తున్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి పార్టీకి చెందిన కొందరు పట్టాల్లో పాగా వేయడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని మందలించినట్టు సమాచారం. తన పేరు చెప్పి ఎవరు స్థలాల పంచాయతీకి వచ్చినా వెంటనే ఫోన్ చేసి తన దృష్టికి తీసుకురావాలని జయరాం వాట్సాప్ గ్రూపుల్లో పోస్టింగ్‌లు షేర్ చేశారు. పట్టణంలో జరిగిన కబ్జాలపై త్వరలో విచారణ జరిపించే యత్నంలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంగా గుంతకల్లు తహసీల్దారు శేషఫణి మాట్లాడుతూ దోనిముక్కల రోడ్డులోని లేఅవుట్లలో ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ కొందరు ఫిర్యాదులు చేశారని, సరైన రికార్డు లేకుండా ఎటువంటి నిర్మాణాలను చేయకుండా తాము చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కొన్ని ఇళ్ల కట్టడాలను ఆపించామని వెల్లడించారు.





రోడ్డును కుదించి చేపట్టిన నిర్మాణాలు

పుట్టుకొస్తున్న నకిలీ పట్టాలు


పట్టణంలో నకిలీ పట్టాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుకున్నదే తడవుగా ఏ తహసీల్దారు పేరిటైనా ఫేక్ పట్టాలు సృష్టించి స్థలాలను అమ్మేస్తున్నారు. దోనిముక్కల రోడ్డులో స్థలాలను ఒకటి, రెండేళ్ల కిందట కొన్నవారి వద్ద పదిహేనేళ్ల కిందట జారీ చేసినట్లుగా సృష్టించిన పట్టాలు ఉన్నాయి. అధికారులు విచారణలో కిందటి సంవత్సరం స్థలాన్ని కొన్నామంటూ పట్టాలను చూపుతుండగా, అందులో 2010 సంవత్సరంలో అప్పటి తహసీల్దారు కోదండరామిరెడ్డి జారీ చేసినట్లుగా వివరాలు ఉన్నాయి. పదిహేను వేలు, ఇరవై వేలకో పట్టాను సృష్టించి అమ్ముకుంటున్నారు. నకిలీ పట్టాలను గుర్తించిన ప్రతి సందర్భంలో అధికారులు ఆ పట్టాపొరాలు చెల్లవని చెబుతున్నారే తప్ప, ఆ నకిలీ పట్టాలు ఎలా పుట్టుకు వస్తున్నాయనే విషయంగా సమగ్ర విచారణ జరపడంలేదు. ఆ దిశలో చర్యలు తీసుకుంటే అసలు బండారం బైటపడే అవకాశం ఉంది.





గుంతకల్లులో పుట్టుకొచ్చిన నకిలీ పట్టాలు





నగరంలో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయం

పద్ధతి ఉండొద్దూ!

వైసీపీ జిల్లా కార్యాలయానికి హెచ్చెల్సీ స్థలం

> మార్కెట్ విలువ రూ.4 కోట్ల పైమాటే..
>
> 33 ఏళ్ల లీజు.. ఏడాది అద్దె ఎకరానికి రూ.వెయ్యి
>
> అప్రూవల్ లేకుండా భవన నిర్మాణ పనులు
>
> అధికారం పోయాక.. ఖాళీ స్థలానికి పన్ను


అనంతపురం/క్రైం, జూన్ 23(ఆంధ్రజ్యోతి): అధికారం చేతిలో ఉన్నప్పుడు జనం నుంచి ఎన్నో రకాల పన్నులను వసూలు చేశారు..! ఆఖరికి చెత్త సేకరణకు కూడా..! కానీ అప్పనంగా తీసుకున్న జలవనరుల శాఖ స్థలానికి పన్ను చెల్లించేందుకు వైసీపీ పెద్దలకు మనసు రాలేదు. అధికారం పోయాకగానీ నగరపాలికకు డబ్బు చెల్లించాలన్న ఆలోచన చేయలేదు. లేఅవుట్ అప్రూవల్ తీసుకోకుండానే భవన నిర్మాణ నిర్మాణ పనులు చేపట్టారు. అదీ.. ఏకంగా అర ఎకరం విస్తీర్ణంలో..! అనంతపురం నగరంలో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం విషయంలో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. స్థల సేకరణ మొదలు.. నిర్మాణ పనుల వరకూ అన్నీ అడ్డగోలు వ్యవహారాలే. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయ భవనాన్ని సీఆర్‌డీఏ అధికారులు కూల్చివేయడంతో.. ఇప్పుడు అనంతలో నిర్మిస్తున్న జిల్లా కార్యాలయ భవనం గురించి చర్చ మొదలైంది. ఇన్నాళ్లూ ఆ పార్టీకి దాసోహం అన్న అధికారులు.. తప్పనిసరి పరిస్థితుల్లో శనివారం నోటీసులు ఇచ్చారు.

కళ్లు మూసుకున్నారా..?

నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో జలవనరుల శాఖకు చెందిన 1.50 ఎకరాల భూమిలో అత్యాధునిక హంగులతో వైసీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్నారు. భవన నిర్మాణం దాదాపు పూర్తి అయ్యింది. కానీ ఇప్పటికీ అహుడా, నగరపాలక సంస్థ అధికారులకు అనుమతులు కావాలని దరఖాస్తు కూడా చేసుకోలేదు. జీ ప్లస్ వన్ నిర్మాణ పనులు అక్రమంగా సాగుతున్నా.. ఏ ఒక్క అధికారీ ప్రశ్నించలేదు. అనుమతులు ఉన్నాయా అని అడిగే సాహసం చేయలేదు. వైఎస్ జగన్‌కు సమీప బంధువు జలవనరుల శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా రిటైర్ అయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ఆయనే.. నాటి ఈఎన్‌సీ నారాయణ రెడ్డి. వైసీపీ జిల్లా కార్యాలయం కోసం జలవనరుల శాఖ భూమిని కేటాయించాలని స్థానిక అధికారులకు ఆయన హుకుం జారీ చేసినట్లు సమాచారం. సర్వే నంబరు 136-1బి, 1బి2, ఏ2లోని 1.50 ఎకరాల ఆ భూమి మార్కెట్ విలువ రూ.4 కోట్లకుపైమాటే. అంతటి విలువైన భూమిని 33 ఏళ్లపాటు లీజుకి ఇచ్చారు. అదీ.. ఏడాదికి ఎకరానికి రూ.1000 అద్దె చెల్లించేలా జీవో నంబర్ 340ని అప్పటి వైసీపీ ప్రభుత్వం జారీ చేసింది.

ఆలస్యంగా నోటీసులు..

వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం విషయంలో అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మిస్తున్నందుకు నోటీసులు జారీ చేశారు. నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ మారుతి హరప్రసాద్ శనివారం సాయంత్రం 5 గంటలకు నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులకు ఏడు రోజుల్లోగా స్పందించాల్సి ఉంటుంది. లేకపోతే మరో నోటీసు జారీ చేస్తారు. ఆ నోటీసుకు 24 గంటలు సమయం మాత్రమే ఉంటుంది. సరైన స్పందన లేకపోతే ఆ భవనాన్ని కూల్చివేసే అధికారం నగరపాలిక అధికారులకు ఉంటుంది. అప్రూవల్ తీసుకోకుండా వ్యవహారం నడిపిన వైసీపీ నేతలు, ఖాళీ స్థల పన్ను కూడా ఆలస్యంగానే చెల్లించారు. అప్రూవల్‌కు ముందు వేకెంట్ ల్యాండ్ టాక్స్ (వీఎల్‌టీ) రూ.7.30 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. తొలుత రూ.30 వేలు మాత్రమే చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని అధికారులు అడిగినా పట్టించుకోలేదట. పార్టీ అధికారం కోల్పోవడంతో ఈ నెల 17న మిగిలిన రూ.7 లక్షలు చెల్లించారు.



రేషన్ పంపిణీలో దోపిడీ

ఎండీయూ వాహనాలు తిరగకపోయినా బిల్లులు

ఒక్కో వాహనదారుడితో నెలకు రూ.5వేలు లంచం

నేతలు, డీలర్లు కుమ్మక్కు.. షాపుల వద్దే సరకుల పంపిణీ

పట్టించుకోని పౌరసరఫరాల శాఖాధికారులు

ఇంటింటికీ రేషన్ పంపిణీ ముసుగులో ప్రభుత్వ సొమ్మును అప్పనంగా దోచేస్తున్నారు. ఎండీయూ వాహనాలు తిరగక పోయినా తిరిగినట్లు నెలనెలా అధికారులు బిల్లులు చేస్తున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం నెలవారీగా వాహనదారుడితో ఇంత లంచం ఇవ్వాలని ఒప్పందం చేసుకొని బిల్లులు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు చిల్లులు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాహనదారులకు వైసీపీ నేతల అండదండలు ఉండడంతో డబ్బులు తీసుకొని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారని తెలుస్తోంది. పైగా డీలర్లు ఎక్కువగా మంది వైసీపీ నేతలే కావడంతో తమ షాపులవద్దకే లబ్ధిదారులను రప్పించుకుంటూ సరకులు అందజేస్తున్నారు. దాదాపు అన్ని మండలాల్లో ఇదే తంతు సాగుతోంది. లబ్ధిదారులకు సకాలంలో సరకులు అందకపోగా.. ఈపేరుతో నెలానెలా లక్షలు ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారు. - అనంతపురం టౌన్



ఎండీయూ వాహనంలో సరకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

వైసీపీ అధికారంలో ఉన్నపుడు రేషన్ సరుకులను లబ్ధిదారులకు ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇక్కడ కూడా తమ పార్టీ కార్యకర్తలకు ఉపయోగపడేలా ఎండీయూ పేరుతో దోపిడీకి తెరలేపారు. అనుకున్నట్లుగానే తమకార్యకర్తలకు ఈ వాహనాల బాధ్యతలను అప్పగించారు. ఒక్కో వాహనానికి నెలకు రూ. 21 వేలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ వాహనాలు కేటాయించిన గ్రామాల్లో ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వతేదీ వరకు రేషన్‌తోపాటు ఇతర సరుకులను కార్డుదారులకు అందజేయాల్సి ఉంటుంది. ఎండీయూ వాహనదారులు, డీలర్లు కుమ్మక్కై ఎఫ్‌పీ షాపుల వద్దే డీలర్ల ద్వారా సరుకులు అందజేస్తున్నారు. నామమాత్రంగా ఎండీయూ వాహనాలను నెలలో రెండు మూడు రోజులు తిప్పుతూ చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు మాత్రం నిబంధనల మేరకు వాహనాలు తిరుగుతున్నాయని రికార్డుల్లో నమోదు చేసి వారి నుంచి నెలవారీగా మామూళ్లు దండుకొని జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● వాహనాలు తిరగకపోయినా బిల్లులు

జిల్లాలో అధికారుల లెక్కల మేరకు ఏడు లక్షల వరకు రేషన్ కార్డులు ఉన్నాయి. 1600 వరకు చౌకధాన్యపు దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా తొలుత సరకులు అందించేవారు. వైసీపీ హయాంలో లబ్ధిదారుల ఇళ్లవద్దకే రేషన్ సరకులు అందజేయాలని ఇంటింటికీ రేషన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాలో 387 వాహనాలు వరకు సరకులు పంపిణీ చేస్తున్నాయి. ఈ వాహనాలు ఎక్కడా తిరగలేదని, వైసీపీ కార్యకర్తలకు ఆదాయవనరులుగా మారినట్లు విమర్శలు ఉన్నాయి. అధికారులు తమ వాటాగా వాహనదారుడి నుంచి నెలకు రూ.5వేలు ధర నిర్ణయించి బిల్లులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

● కొత్త ప్రభుత్వం రాకతో గుబులు

ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజే చాలాచోట్ల టీడీపీకి చెందిన డీలర్ల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు దౌర్జన్యంగా తీసుకెళ్లారు. ఇపుడు ఆ షాపులను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తెలుగుదేశం నేతలు గురిపెడుతున్నారు. గతంలో లబ్ధిదారులకు డీలర్లు కార్డులో నమోదు చేసి తూకాల్లో సరకులు ఇచ్చేవారు. ఇపుడు ఈ-పోస్ విధానంలో వేలిముద్రలు వేస్తేనే సరకులు ఇవ్వడానికి వీలవుతుంది. ఆ యంత్రాలు వ్యవహారంపై కొత్తప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇటు డీలర్లు, ఎండీయూ వాహనదారులు అటు అధికారులలో టెన్షన్ మొదలైంది.

సర్వేజనా దుఃఖినోభవంతు!



భూ రీసర్వేతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

రీసర్వేతో తరిగిపోయిన భూవిస్తీర్ణం

లబోదిబోమంటున్న బాధిత అన్నదాతలు

కళ్యాణదుర్గం, జూన్ 23: ప్రభుత్వం ఏదైనా పని ప్రారంభిస్తే దాని ద్వారా ప్రజలకు మేలు కలగాలి. అయితే గత వైసీపీ పాలనలో చేపట్టిన పనులు పలువురిని ఇబ్బందుల్లోకి నెట్టాయి. అలాంటిదే సమగ్ర భూ రీసర్వే కార్యక్రమం. ఇది రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. భూ రీసర్వే ద్వారా ఉన్న భూమి విస్తీర్ణాన్ని సైతం తగ్గించేశారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న సర్వే నెంబర్లకు వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూమికి భారీ తేడా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతల కాలం నాటి పట్టా భూములకు కూడా రీ సర్వేలో అన్యాయం చేశారని పలువురు విమర్శిస్తున్నారు.

అవగాహనారాహిత్యంతోనే..

కొంతమంది రైతులకు ఆయా సర్వే నెంబర్లపై ఉన్న భూములను అసలు వెబ్‌ల్యాండ్‌లో చూపించడం లేదు. అధికారులు ఇష్టానుసారంగా రీ సర్వే చేసి, ఏ మాత్రం అవగాహన లేకుండా భూములకు హద్దులు చూపించి, రీసర్వేను మమా అనిపించేశారు. అనుభవంలో ఉన్న భూమి రికార్డుల్లో తగ్గిపోవడంతో బాధిత రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబోదిబోమంటున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాలకు సంబంధించి రీసర్వే తహసీల్దార్లను వైసీపీ హయాంలో నియమించారు. వారి ఆధ్వర్యంలోనే భూములన్నీ రీసర్వే చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు బ్యాంకుల్లో రుణాల కోసం రెన్యువల్ చేసేందుకు 1బి, అడంగల్ కోసం వెళితే అసలు వాస్తవాలు బయటపడుతున్నాయి. పట్టాదారు పాసు పుస్తకం సర్వే నెంబర్‌లో ఉన్న భూమికి, వెబ్ ల్యాండ్‌లో చూపుతున్న భూమికి ఏ మాత్రం పొంతన ఉండటం లేదు. ఉన్న భూమిని చూపించి హద్దులు ఏర్పాటు చేయాలే గానీ, కొత పెట్టి ఇక్కడికే నీ భూమి అని హద్దులు చూపడం దారుణమని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రతి మండలంలోను ఇదే సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రైతులు తహసీల్దార్ కార్యాలయాల వద్దకు వెళ్లి సమస్య విన్నవించుకుంటున్నా ఫలితం లేదు. వెబ్‌ల్యాండ్‌లో 1బి, అడంగల్ కూడా ఆ భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాలు రావడం లేదు. అప్పట్లో హడావుడిగా సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసి తోచిన విధంగా సర్వే చేసి మమ అనిపించారే కానీ పూర్తిగా బాధ్యతాయుతంగా పనిచేయకపోవడం తోనే ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రీసర్వేతో రైతులకే బాధలు



వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే ఇష్టానుసారంగా చేయడం వల్ల రైతులకు బాధలు తప్పడం లేదు. నాకున్న భూమి సర్వే నెంబర్ 35లో 45 సెంట్లు వెబ్‌ల్యాండ్‌లో వివరాలు చూపడం లేదు. సర్వే నెంబర్ 32లో కూడా పది సెంట్లు వెబ్‌ల్యాండ్‌లో ఏ మాత్రం కనిపించడం లేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

- జీ రామాంజి, బాధిత రైతు, మేళకుంట

వెబ్‌ల్యాండ్‌లో వివరాలు చూపడం లేదు



నా భూమికి సంబంధించి 2.94 ఎకరాలకుగాను 2.70 ఎకరాలు మాత్రమే వెబ్ ల్యాండ్‌లో చూపుతోంది. మా గ్రామంలో రీసర్వే చేసినప్పటి నుంచి ఈ సమస్య మొదలైంది. రీ సర్వేతో మంచి జరుగుతుందనుకున్నామే కానీ చివరకు నట్టేట మునిగే పరిస్థితి వచ్చింది.

- బి సురేష్, బాధిత రైతు, మేళకుంట

3.10 ఎకరాలే చూపుతోంది: రామాంజి, బాధిత రైతు, మేళకుంట



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. భూ రీసర్వే చేయడం వల్ల నాలుగు ఎకరాలకు గాను 3.10 ఎకరాలు మాత్రమే వెబ్‌ల్యాండ్‌లో చూపుతోంది. మిగిలిన భూమి వివరాలు వెబ్‌ల్యాండ్‌లో చూపడం లేదు. 34 సెంట్లు, 59 సెంట్లు వెబ్ ల్యాండ్‌లో కనిపించకుండా పోయాయి. అధికారులను అడిగినప్పటికీ వారు కూడా స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు.

మాకే ఎదురు నిలబడతావా?

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

కణేకల్లు, జూన్ 23: మండలంలోని మారెంపల్లి గ్రామంలో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గొల్ల మారుతి, గొల్ల శీనప్పలపై వైసీపీ నాయకుడు సింగల్ విండో మాజీ అధ్యక్షులు మారెన్న కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. సాయంత్రం గొల్ల మారుతి దేవాలయం వద్ద కూర్చుని ఉండగా ఏరా గ్రామంలో నీది ఎక్కువైందని శ్రీకాంత్ అనే వ్యక్తి వచ్చి దాడి చేశాడు. నన్నెందుకు కొడుతున్నావురా అంటే ఏరా మాకే ఎదురు నిలబడతావా మమ్మల్ని తగిలే ధైర్యం ఉందా అని శ్రీకాంత్‌తో పాటు ఆయన సోదరుడు వెంకటేశులు కలిసి మరింతగా కొట్టారు. అడ్డుగావెళ్లిన గొల్ల శీనప్పను సైతం చితకబాదారు. అక్కడ నుంచి బాధితుడు ఇంటికి వెళ్లినా వదలకుండా శ్రీకాంత్, వెంకటేశులుతో పాటు బసవరాజు, అనిల్ మరో ఇద్దరు కలిసి కాళ్లతో తన్నుతూ పిడుగుద్దులు గుద్దారు. గాయపడిన మారుతి, శీనప్పలను కుటుంబసభ్యులు, స్థానికులు కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆసుపత్రి వద్ద వైసీపీ నాయకుల దౌర్జన్యం

బాధితులను కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత వైసీపీ నాయకుడు రామన్న అక్కడికి వచ్చి టీడీపీ నాయకులకు దమ్ముంటే రండిరా చూసుకుందాం. గీత గీస్తున్నా.. అంటూ సవాల్ చేస్తూ దౌర్జన్యపూరితమైన మాటలు మాట్లాడాడు. స్థానికంగా పోలీసులు ఉన్నప్పటికీ ఆ వైసీపీ నాయకుడిని మందలించడంలో విఫలమయ్యారు. గతంలో ఎస్ఐగా పనిచేసి సీఐగా ఉద్యోగోన్నతి పొందిన వ్యక్తి అండతోనే వైసీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారనే విమర్శలున్నాయి.



బాధితుడిని విచారిస్తున్న పోలీసులు

నేటి నుంచి 'మీ కోసం'

- ప్రజాసమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ
- అధికారులకు కలెక్టరు ఆదేశాలు
- మూడు నెలల తర్వాత మళ్లీ మొదలు
- ఇప్పుడైనా సమస్యలు పరిష్కారమయ్యేనా..?



కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్ 23 : వైసీపీ ప్రభుత్వం స్పందన పేరుతో ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని సోమవారం నుంచి 'మీ కోసం' పేరుతో మళ్లీ ప్రారంభించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు. ప్రస్తుతం కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇక జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహిస్తారు.

• ఫిర్యాదుకు ఆధార్, ఫోన్ నంబరు తప్పనిసరి

'మీ కోసం'లో ఫిర్యాదు చేసేవారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు జిరాక్స్ లేదా నెంబరు, ఫోన్ నెంబరు వినతిలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ ఫిర్యాదులను మీ కోసం పోర్టల్ ఆన్‌లైన్‌లో అధికారులు అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఏ జిల్లా నుంచి ... ఏ మండలం నుంచి ఎన్నెన్ని ఫిర్యాదులు వచ్చాయి... వాటిలో అధికారులు ఎన్నింటిని పరిష్కరించారు.. అని రాష్ట్ర స్థాయిలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు, ఆయా శాఖల కమిషనర్లు స్వయంగా పర్యవేక్షిస్తారు. దీంతో ఫిర్యాదులో తప్పనిసరిగా ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఎవరికైనా తమ సొంత ఫోన్ నెంబరు లేకపోతే తమసంబంధీకుల నెంబరైనా నమోదు చేయవచ్చు.

• ఇకనైనా పరిష్కారమయ్యేనా..?

వైసీపీ ప్రభుత్వం హయాంలో బాధితులు అనేక సమస్యలపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించేవారు కాదు. కలెక్టరు, జేసీ, డీఆర్ఓ, ఆర్డీఓల వద్ద బాధితులు కన్నీరు పెట్టుకున్నా స్పందన ఉండేది కాదు. పత్రికల్లో కథనాలు రాసినా అధికారులు పట్టించుకునేవారు కాదు. కారణం ఆ అక్రమాలు, దౌర్జన్యాలు వెనుక నాడు వైసీపీ నాయకులు ఉండటంతో ఉన్నతాధికారులు సైతం ఆ ఫిర్యాదులు, వినతులపై మౌనంగా ఉండేవారు. కనీసం ఆ ఫిర్యాదులను స్పందన ఆన్‌లైన్‌లోకి కూడా ఎక్కించేవారు కాదు. దీంతో బాధితులు స్పందన కార్యక్రమంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకుండా పోయింది. ఇదేమి స్పందన అంటూ బాధితులు అధికారులపై శాపనార్థాలు పెట్టేవారు. ఇపుడు కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. కలెక్టరు కూడా కొత్తగా ఇక్కడికి వచ్చారు.. మరి ఇప్పుడైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయా.. అని బాధితులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇకనైనా ఈ కొత్త కలెక్టర్ ప్రజా సమస్యలను పరిష్కరిస్తారో.. లేదో.. వేచి చూడాలి మరి.

అనంతలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటన

- తొలిరోజు జీడిపల్లి రిజర్వాయర్, డ్రిప్ సిస్టం, ఉపాధి పనుల పరిశీలన



ఆత్మకూరు సమీపాన అరటి సాగును పరిశీలిస్తున్న బృందం

అనంతపురం టౌన్/ఆత్మకూరు, జూన్ 23: సివిల్ సర్వీసెస్ 2023బ్యాచ్‌కు ఎంపికైన ఐఏఎస్‌ల బృందం అనంత జిల్లా పర్యటనకు వచ్చింది. ఇందులో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, సీహెచ్ కల్యాణి (కర్నూలు), దామెర హిమవంశీ (చిత్తూరు), పవర్ స్వాప్నిల్ జగన్నాథ్ (గుంటూరు), హెచ్‌ఎస్ భావన (కాకినాడ), సుభామ్‌నాక్వల్ (ఎన్‌టీఆర్ జిల్లా) ఉన్నారు. ఈ బృందం ఆదివారం ఉదయం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. బెళుగుప్పమండలం రిజర్వాయర్‌కు వెళ్లి అక్కడకు నీరు ఎలా వస్తుంది..? ఎంతమేర వస్తుంది..? తాగు, సాగుకు ఏవిధంగా ఉపయోగపడుతుంది..? తదితర విషయాలను కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత ద్వారా అడిగి తెలుసుకున్నారు. అక్కడి ప్రాంత రైతులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలంలో రైతులు డ్రిప్‌ద్వారా సాగుచేసిన అరటి తోటలను పరిశీలించారు. పంటకు పెట్టుబడి, దిగుబడి గురించి రైతులతో అడిగి తెలుసుకున్నారు. అదే మండలంలో మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం రాప్తాడు మండలంలోని హంపాపురం గ్రామంలో ఉపాధి పనుల ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్‌ను పరిశీలించారు. నార్పల మండలంలో పంటల సాగును పరిశీలించి అక్కడనుండి శ్రీసత్యసాయి జిల్లాకేంద్రమైన పుట్టపర్తికి ఐఏఎస్‌ల బృందం వెళ్లింది.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి: రైతులు

ఆత్మకూరు: పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి నూతన ఐఏఎస్‌ల బృందాన్ని రైతులు కోరారు. ఆత్మకూరులో ఫ్రూట్ ప్రాసెసింగ్ కేంద్రం, పండ్లతోటలు, డ్రిప్ పరికరాలను బృందం పరిశీలించింది. అరటి తోటను పరిశీలించారు. బీర పంట సాగుచేసిన రైతు అమర సింహతో పంట సాగు, పెట్టుబడి, దిగుబడి, లాభాలు తదితర విషయాలపై మాట్లాడారు. పంటలు పండిస్తున్న రైతుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు బృందాన్ని కోరారు. హార్టికల్చర్ అధికారులు ఫిరోజ్‌ఖాన్, రత్నాకర్, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు బృందం వెంట ఉన్నారు.

సామాజిక సమస్యలపై సమరమే 'శ్వాసతో యుద్ధం'

- పుస్తకావిష్కరణలో వక్తలు



'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, జూన్ 23: సామాజిక సమస్యలపై చేసే సమరమే 'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటి సారాంశమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కవి మధురశ్రీ రచించిన ఈ కవితా సంపుటి ఆవిష్కరణ సభను ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షుడు తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి నారాయణస్వామి మాట్లాడుతూ కవిత్వం, కథ, నవల ఏదైనా సమాజంలో ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాలను బట్టి పరిశీలనా దృష్టి మారుతున్నపుడే ఆ సాహిత్యానికి సార్థకత ఉంటుందన్నారు. మధురశ్రీ తన కవిత్వంలో ఇతరులెవరూ స్పృశించని స్పృశించారన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మధురశ్రీ కవిత్వం కాలానికి నిలబడే కవిత్వమన్నారు. మధురశ్రీ మాట్లాడుతూ తనను కవిగా తీర్చిదిద్దిన అనంత నేలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో సాహితీకారులు ఉప్పరపాటి వెంకటేశులు, ఎల్ఆర్ వెంకటరమణ, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, కోశాధికారి కోటిగారి వన్నప్ప, ఉపాధ్యక్షుడు గోసల నారాయణస్వామి, గౌరవ సలహాదారు కంబదూరి షేక్ నబిరసూల్, జెన్నె ఆనంద్‌కుమార్, మిద్దె మురళీకృష్ణ, టీవీ రెడ్డి, నానీల నాగేంద్ర, ఈరన్న, దాసన్నగారి కృష్ణమూర్తి, తూముచర్ల రాజారాం, చం.శాస్త్రి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ వేరుశనగ పట్టివేత

లారీ సీజ్... 333 బస్తాలు స్వాధీనం

తనకల్లు, జూన్ 23: అక్రమంగా తరలిస్తున్న వేరుశనగ కాయలను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మండలపరిధిలోని బిళ్లూరువాండ్లపల్లి గ్రామం నుంచి అక్రమంగా 333 బస్తాల సబ్సిడీ వేరుశనగ కాయలను తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. ఎస్‌ఐ ధరణీబాబు వెంటనే బిళ్లూరివాండ్లపల్లి గ్రామానికెళ్లి అక్రమంగా తరలిస్తున్న వేరుశనకాయల వాహనాన్ని పట్టుకున్నారు. విషయాన్ని ఏఓ శ్రీహరినాయక్‌కు సమాచారం అందించారు. ఏఓ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అక్రమంగా తరలిస్తున్న వేరుశనగ కాయలను పరిశీలించి, బస్తాలకు ప్రభుత్వ ట్యాగులుండడంతో ప్రభుత్వ సబ్సిడీకాయలుగా నిర్ధారించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సుబహాన్ రైతుల వద్దనుంచి కొనుగోలు చేసి ప్రొద్దుటూరులోని ఓ ఏజెన్సీకి తరలిస్తున్నట్లు సమాచారం. వేరుశనగ కాయల ఐచర్ లారీని సీజ్ చేసి, కేసు నమోదుచేసి, విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు ఏఓ తెలిపారు.



బిళ్లూరివాండ్లపల్లిలో సబ్సిడీ వేరుశనగ కాయలను వ్యాన్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్

- చేనేతకు పూర్వవైభవం తెస్తా
- విలేకరుల సమావేశంలో మంత్రి సవిత

హిందూపురం, జూన్ 23: ఇంటి వద్దకే సామాజిక భద్రత పింఛన్లను జూలై 1 నుంచి పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుయస్, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా సొంత నియోజకవర్గమైన పెనుకొండకు ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద నుంచి పెనుకొండ వరకు భారీ వాహన శ్రేణితో ర్యాలీగా వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్డీయే కూటమితో రాష్ట్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో ముందు వరుసలో వుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తారన్నారు. కూటమి హయాంలో చేనేతలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. చేనేతల బతుకుల్లో వెలుగులు నింపుతామన్నారు. గత టీడీపీ హయాంలో అమలు చేసిన చేనేత సంక్షేమం, రాయతీలు అభివృద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తానన్నారు. ఇంత పెద్ద పదవి రావడానికి కారణమైన నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి వుంటానన్నారు. త్వరలోనే బీసీ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లల్లో వెనుకబడిన విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రాలపై తొలి సంతకం చేశానన్నారు. ఎన్టీఆర్ విదేశీ విద్య కొనసాగుతుందని 2014 నుంచి 2019 వరకు ఉమ్మడి 13 జిల్లాలకు మంజూరైన బీసీ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. చేనేత, హస్త కళాకారులకు సబ్సిడీ, ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

శ్రమకుతగ్గ ఫలితం దక్కింది

పరిటాల శ్రీరామ్

పెనుకొండ టౌన్, జూన్ 23: అలుపెరుగని పోరాటం చేసిన సవితకు శ్రమకుతగ్గ ఫలితం దక్కిందని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆదివారం మంత్రి సవిత భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తమ ప్రాంతానికి చెందిన మహిళకు మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో బలమైన సామాజికవర్గమైన కురుబలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు. బీసీ హక్కులకోసం సవిత కచ్చితంగా పోరాటం చేస్తారన్నారు. ధర్మవరంలో చేనేతలు అధికంగా ఉన్నారని, వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి సవిత సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో మాధవనాయుడు, రఘువీరాచౌదరి, బాబుల్ రెడ్డి, త్రివేంద, సర్పంచ్ శ్రీనివాసులు వున్నారు.

కొత్తచెరువు వాసికి అరుదైన గౌరవం

ఆసియాస్థాయి వైద్యుల సదస్సులో డాక్టర్ శిల్పాచౌదరికి ప్రథమస్థానం



ప్రశంసాపత్రాన్ని చూపుతున్న డాక్టర్ శిల్పాచౌదరి

కొత్తచెరువు, జూన్ 23: దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా గైనకాలజీ, రోబోటిక్ శస్త్రచికిత్స (ఏఎస్‌జీఆర్‌ఎస్ 2024) విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన డాక్టర్ పెద్దప్పొళ్ల శిల్పాచౌదరికి అరుదైన గౌవరం లభించింది. శనివారం దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా గైనకాలజీ, రోబోటిక్ శస్త్రచికిత్సలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో ఆమె నిలిచారు. దీంతో ఆ దేశానికి చెందిన వైద్యులు ఆమెకు ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందజేశారు. డాక్టర్ శిల్పాచౌదరి కర్నూలు వైద్యశాలలో వైద్యవిద్యను పూర్తిచేశారు. వారణాసిలోని బెనారెస్ హిందూవిశ్వవిద్యాలయంలో గైనకాలజీ విభాగంలో పీజీ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో గైనకాలజీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెకు కొత్తచెరువు వాసులు అభినందనలు తెలిపారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

1వ తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించేలా చట్టం తేవాలి

ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ



మాట్లాడుతున్న హరికృష్ణ

అనంతపురం విద్య, జూన్ 23: పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియంను కూడా కొనసాగించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపునకు సంబంధించి చట్టబద్ధత తేవాలని కోరారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చే వరకు యాజమాన్యం వారీగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా నేరుగా 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. కర్నూలు జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్నారన్న నెపంతో సస్పెండ్ చేసిన టీచర్లపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా 3 నుంచి 8వ తరగతి వరకు పాఠశాల సహాయకులతోనే బోధన కొనసాగించాలన్నారు. ప్రైమరీ స్కూళ్లు ఉదయం 9.15 గంటలకు, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు 9.30గంటలకు, హై స్కూళ్లు 9.40 గంటలకు ప్రారంభమయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి ప్రేమ్‌నాథ్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు శేష ఫణి, నారాయణ నాయక్, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, పీవీ శ్రీనివాసులు, గోపాలప్ప, రామలింగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లను కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

అనంతపురం విద్య, జూన్ 23: ఉపాధ్యాయులు సమష్టి కృషితో స్కూళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ సూచించారు. ఆదివారం శారదా స్కూల్‌లో ఆ సంఘం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం జీవో 117ను రద్దు చేయడంతోపాటు, 3,4,5 క్లాసుల విలీనాన్ని కూడా రద్దు చేయాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్ టీచర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. టీచర్లకు గుదిబండగా మారిన యాప్స్‌ను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఐదేళ్లుగా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. టీచర్లపై గతంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోను బోధన జరిగేలా చూడాలని, సెకెండరీ స్థాయిలో సమాంతర మీడియం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామప్ప, సరళ, రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆయన రూటే వేరు..!

వైసీపీ ప్రజాప్రతినిధులు చెప్పారంటే.. ఇట్టే చేసేవారట

ఆ పార్టీ నాయకులతో అంటకాగుతున్న వైనం

విద్యుత్ శాఖలో ఓ ఉన్నతాధికారి తీరుపై విమర్శలు

అనంతపురంరూరల్, జూన్ 23: ఉమ్మడిజిల్లా విద్యుత్‌శాఖలో ఆయన ఓ ఉన్నతాధికారి. ఉన్నతాధికారి అంటే అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలి. ఈ అధికారి మాత్రం ఎక్కువగా వైసీపీ ప్రజాప్రతినిధుల సేవలో తరిస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఏ పనైనా సరే వైసీపీ నాయకుల తరువాతే అంటూ ఆయన మాట్లాడటం చూస్తే ఆయన ఏ మేరకు వారి సేవలో తరిస్తున్నారో అర్థమవుతుంది.

ఆది నుంచీ వైసీపీ సేవలోనే..

ఆ ఉన్నతాధికారి గతంలో జిల్లాలోని ఓ డివిజన్ అధికారిగా పనిచేవారు. మూడేళ్ల కిందట జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈక్రమంలో అక్కడకు వెళ్లారు. ఏం జరిగిందో ఏమో తెలియదుకానీ ఆ అధికారి బదిలీ ఉత్తర్వులు మారిపోయాయి. తిరిగి జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందుకు పెద్ద మొత్తంలోనే సంబంధిత ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టచెప్పారన్న వాదనలు ఉన్నాయి. జిల్లాకు వచ్చినప్పటి నుంచి ఈయన వ్యవహార శైలి మారిందన్న వాదనలున్నాయి. వైసీపీకి అంటకాగి మరీ పనిచేస్తూ వచ్చారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఏది చెబితే వాటిని చేసేవారు. వారు చెప్పిన వారికే పనులు చేసేవారు. వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పైకి మాత్రం సీనియారిటీ అంటూనే నిబంధనలు మరిచి వైసీపీ నాయకుల సిఫారసులకు ప్రాధ్యానత ఇచ్చారని తెలుస్తోంది. మరి ముఖ్యంగా ఓ మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేకు అత్యంత ప్రాధ్యానం ఇచ్చేవారిని ఆయా వర్గాల్లో చర్చజరిగింది. వారు ఏది చేబితే అందుకు అనుగుణంగా పనులు చక్కబెట్టేసేవారని ఆశాఖ వర్గాలే పేర్కొంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ల మంజూరులోనే కాదు సబ్‌స్టేషన్లు, జగనన్న లేఅవుట్ల విషయంలో కూడా ఆయన వ్యవహార శైలి అదేవిధంగా ఉండేదంటున్నారు. కొత్తగా ఏర్పాటైన సబ్‌స్టేషన్లలో వైసీపీ అనుకూల వర్గం సభ్యులకు ఆపరేటర్ పోస్టులు ఇచ్చి నాయకులకు లబ్ధి చేకూర్చేలా పనిచేశారంటున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒక్కొక్క ఆపరేటర్ పోస్టు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు సొమ్ముచేసుకున్నట్లు సమాచారం.



విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం

అనుకూలమైన వారిపై చర్యలు శూన్యం

తన శాఖలో కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులు ఎవరైనా సరే ఆయనకు అనుకూలంగా ఉండాల్సిందే. లేదంటే ముప్పుతిప్పలు పేట్టేస్తాడన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఆయన మాట వినకుంటే కింది స్థాయి అధికారులు, ఉద్యోగుల మీద ఎవైనా ఫిర్యాదులు రావడం ఆలస్యం.. అంతే ఆఘమేఘాల మీద చర్యలకు ఆదేశాలు ఇచ్చేసేవారంటున్నారు. కొన్ని సందర్భాల్లో సస్పెండ్ చేయడం, లేకుంటే వేతనాలు నిలుపుదలకు సిఫారసులు చేయడం పనిగా పెట్టుకొనేవారంటూ మాట్లాడుకుంటున్నారు. అదే ఆయనకు అనుకూలంగా ఉన్నారంటే వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా పత్రికల్లో కథనాలు వచ్చినా చూసీచూడనట్లు వ్యవహరించేవారన్న వాదనలు లేకపోలేదు. వారి తప్పులను కప్పిపుచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం కొసమెరుపు. ఇక ఆయన సామాజిక వర్గానికి సంబంధించి ఎవరు ఎన్ని అక్రమాలకు పాల్పడిన మరింతగా వెనకేసుకునే విధంగా వ్యవహరించేవారని వాదనలు ఆయా వర్గాల్లో ఉన్నాయి. ఎంతో మంది అధికారులు ఆ సీట్లో పనిచేశారు. ఈయనలా వ్యవహరించింది లేదు.. అంటూ ఆ అధికారి తీరుపై ఉద్యోగులు అంటున్నారంటే ఆయన వ్యవహారశైలి ఏంటో అర్థమవుతుంది.

మహాత్మాగాంధీ సమాధి వద్ద ఎంపీ అంబికా నివాళి



అనంతపురం అర్బన్, జూన్ 23: అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ సమాధి వద్ద ఆదివారం నివాళులర్పించారు. సోమవారం ఆయన పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

పశువుల సంత ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురంరూరల్, జూన్ 23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,37,660 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,32,660, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆ వుల సంతతో రూ.1,05,000 ఆదాయం వచ్చిందని తెలిపారు.

అక్విడెక్ట్‌కు గండి కొట్టిన నాన్ ఆయకట్టు రైతులు

విడపనకల్లు, జూన్ 23: జీబీసీకి సాగు నీరు రాక ముందే నాన్ ఆయకట్టు రైతులు 14వ కిలోమీటరు వద్ద హావళిగి పెద్ద వంకకు కాలువ నీటిని మళ్లించుకునే ప్రయత్నాలు చేపట్టారు. గతేడాది కాలువకు సాగునీరు వచ్చిన సమయంలో 14వ కిలోమీటరు వద్ద ఉన్న అక్విడెక్ట్‌కు నాన్ ఆయకట్టు రైతులు మిరప పంటకోసం డ్రిల్లింగ్ మిషన్లతో రంధ్రాలు వేసి సాగు నీరును పెద్ద వంకకు మళ్లించుకు వెళ్లారు. అయితే ప్రస్తుతం ఇంకా జీబీసీకి సాగు నీరు రాలేదు. జూలైలో సాగు నీరు వచ్చే అవకాశాలు ఉండటంతో మిరప రైతులు (నాన్ ఆయకట్టు) వారు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుని అక్విడెక్ట్ కింద భాగంలో రాళ్ల కట్టడాన్ని తొలగించారు. దీంతో కాలువకు సాగు నీరు వస్తే దాదాపుగా ఓ డిస్ట్రిబ్యూటరీకి వెళ్లే అంత సాగు నీరు వంకకు వెళ్తుంది. జీబీసీ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక అవస్థలు పడుతారు. ఆరవ కాలువకు చివరి ఆయకట్టుకు చుక్కనీరు వెళ్లే పరిస్థితి ఉండదు. ప్రతి ఏటా హావళిగి, కరకముక్కల, రూపనగుడి, గ్రామాలకు చెందిన నాన్ ఆయకట్టు రైతులు జీబీసీ కాలువ నీటిని హావళిగి పెద్ద వంక ద్వారా తరలించుకు వెళ్తూ ఉన్నారు. ఈసారి మాత్రం ముందుగానే అక్విడెక్ట్‌కు ఉన్న రాళ్ల కట్టడాన్ని తొలగించారు.



జీబీసీ అక్విడెక్ట్‌కు కొట్టిన గండి

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శుభాకాంక్షలు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
యాడ్స్ డిపార్ట్‌మెంట్ :
99854 11165, 99854 11179, 9900167475,
అనంతపురం : 99854 10956, 99854 01243, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంకుల్లో, తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి క్యాష్ పేమెంట్ చేయబడును. గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA-189263

ఎగ్జిక్యూటివ్‌లు కావలెను
బుక్కరాయసముద్రం, బళ్లారి, హవళిగి, గుత్తి, రామగిరి, బత్తలపల్లి, పరిసర ప్రాంతాల్లో స్వరాజ్ ట్రాక్టర్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు కావలెను.
Cell: 8374559867,8465066566,7799133395.
AJA-189166

WANTED TEACHERS
Wanted Qualified Teachers to Teach English Medium in Higher School For the following Subjects Maths, Telugu, Hindi & Sciences,Contact: Little Flower E.M.School, ATP, Cell:9949083624
AJA-189161

WANTED TEACHERS
WANTED TEACHER'S MATHS, ENGLISH, HINDI For 6th to 10th EM. Un-Trained (UG/PG) Also Preferable But 2 YearsTeaching Experience Must. For Staying Teachers Providing Food & Accomodation. For Daily Travelling 30KM (TA). Contact : VIGNAN EM HIGH SCHOOL, SOMANDEPALLI, NEAR PENUKONDA,SRI SATHYA SAI (Dist) A.P. 8309913221,9347986668
AJA-189482

గాయత్రి జ్యోతిష్యం
సంప్ర: 9440532926
AJA-189162

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/నగదు ద్వారా లావాదేవీలు జరిపిన, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



చెర్లోపల్లిలో పరిటాల సునీతకు హారతులు పడుతున్న మహిళలు

పరిటాల సునీతకు ఘన స్వాగతం

రామగిరి, జూన్ 23: అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా ఆదివారం మండలానికి వచ్చిన పరిటాల సునీత గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు, మహిళలు హారతులు పట్టారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పూలవర్షం కురిపించారు. పరిటాల సునీత అందరిని ఆప్యాయంగా పలుకరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతానని గ్రామస్థులు భరోసా ఇచ్చారు.

ప్రజావసరాలకు స్థలం కేటాయించాల్సిందే

అనంతపురంరూరల్, జూన్ 23: మండలంలోని పాపంపేట పంచాయతీలో వేస్తున్న లేఅవుట్‌లో ప్రజా అవసరాలకు స్థలం కేటాయించాలని, లేకుంటే ఆ స్థలానికి కంచె వేయ డాన్ని అడ్డుకుంటామని స్థానిక టీడీపీ నాయకులు స్పష్టం చేశారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఆది వారం ఆ లే అవుట్‌ను పరిశీలించిన వారు మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 39-1లో రెండు ఎకరాలకు పైగా లేఅవుట్ వేస్తున్నారన్నారు. అయితే పంచాయతీ అవసరాలకు స్థలం కేటాయించకుండా 20 సెంట్లు.. 25 సెంట్లు ఇలా బిట్లుగా అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో రెండురోజుల నుంచి ప్రహరీ వేస్తున్నారన్నారు. శనివారం కూడా లేఅవుట్ దారుతో మాట్లాడి పెన్సింగ్ వేయకుండా అడ్డుకున్నామన్నారు. కళ్యాణదుర్గం.. బళ్లారి లింక్ రోడ్డుకు, పంచాయతీ అవసరాలకు కేటాయించకపోతే.. లే అవుట్‌ను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు రామాంజినేయులు, లింగయమ్మ, బాబావలి పాల్గొన్నారు.

ఒలింపిక్ డే సందర్భంగా తైక్వాండో పోటీలు

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 23: ఒలంపిక్ డేను పురస్కరించుకుని ఆదివారం స్థానిక అశోక్ నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా తైక్వాం



పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ నాయకులు

డో సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు వంద బాల, బాలికల క్రీడాకారులు ఓపెన్ క్యాటగిరి పోటీలలో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్ మాట్లాడుతూ.... కరవు జిల్లాలో క్రీడానైపుణ్యతకు కొదవలేదని, ప్రోత్సాహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో, ఒలంపిక్‌లో పతకాలు సాధించే సత్తా ఉన్న క్రీడాకారులు జిల్లాలో ఉన్నారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు కేశవ్, వెంకట్, రాజేష్, మునీంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

అమ్మవార్ల సేవలో జ్ఞానానందగిరిస్వామి

చెన్నేకొత్తపల్లి, జూన్ 23: మండలంలోని న్యామద్దల గ్రామంలోని చౌడేశ్వరిదేవి, మహేశ్వరదేవి ఆలయాలను తొగటవీర క్షత్రియుల కులగురువు జ్ఞానానం దగిరిస్వామి ఆదివారం దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆ గ్రామస్థులు ఘన స్వాగతం



స్వామికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

పలికారు. అనంతరం స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జూన్ 23: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఆదివారం నగరంలో బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మందల శాంతకుమార్ పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, సూర్యప్రకాష్, ఇలియాజ్, రాజశేఖర్, శివతేజ పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు ఘన సన్మానం

చెన్నేకొత్తపల్లి,జూన్ 23: మండలంలోని హరియన్ చెరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు గత నెల 31 ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనతో పాటు ఆయన సతీమణి లక్ష్మీదేవిని సీకేపల్లి ఉన్నతపాఠశాలలో



ఆదివారం ఉపాధ్యాయులు, బంధువులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, వైఎస్ఆర్ ఉపాధ్యాయ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వాసవీ సత్ర సముదాయాల కార్యవర్గ సభ్యుడిగా జగదీష్

అనంతపురం కల్చరల్: వాసవీ సత్ర సముదాయాల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనంతపురం నగరానికి చెందిన తిరువీధుల జగదీష్ ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలు లోని మౌర్య ఫంక్షన్‌హాల్‌లో వాసవీ సత్రసముదాయాల చైర్మన్ టీజీ వెంకటేష్ సమక్షంలో కార్యవర్గ సభ్యుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా తరపున హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్‌ను కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వాసవీ సత్ర సముదాయాల గౌరవాధ్యక్షుడు సిద్దనాగేశ్వరరావు, అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు కలిసి జగదీష్‌ను సన్మానించారు.



జగదీష్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

లక్ష మొక్కల పంపిణీ

నార్పల, జూన్ 23: స్థానిక సిద్ధార్థ పిరిమడ్ కేంద్రం ఆవరణంలో ఆదివారం సాయంత్రం పిరమిడ్ సీనియర్ మాస్టర్ నార్పల దత్తపుత్రుడు హనమంతు ఆధ్వర్యంలో లక్ష మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథులుగా అనంతపు రానికి చెందన ధ్యానలు, నార్పల



మొక్కలు పంపిణీ చేస్తున్న ధ్యానమండలి సభ్యులు

చుట్టుపక్కల గ్రామల నుంచి వచ్చిన ధ్యానులు విచ్చేశారు. వీరబ్రహ్మ మయ్యగా పేరు తెచ్చుకున్న బత్తలపల్లికి చెందిన అహమ్మద్ బాషా ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ పిరమిడ్ ధ్యానులు పాల్గొన్నారు.

ఐదేళ్లయినా... అంతంతే..!

రాప్తాడు వద్ద నత్తనడకన ఆర్వోబీ పనులు

వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



ఆర్వోబీ వద్ద ముందుకు సాగని రోడ్డు



ఆగిపోయిన అండర్ గ్రౌండ్ పనులు

రాప్తాడు, జూన్ 23 : రాప్తాడు సమీపంలోని రైల్వే ట్రాక్‌పై నిర్మిస్తున్న వంతెన (ఆర్వీబీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు ప్రారంభించి ఐదేళ్లయినా నేటికీ పూర్తి కాలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చిన సమయంలో గేటు వేస్తుండటంతో వాహనదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్, బెంగుళూరు నుంచి ఎన్ హెచ్ 44 మీదుగా వచ్చే వాహనాలు పంగల్ రోడ్డు మీదుగా అనంతపురం నగరం, చెన్నై జాతీయ రహదారిలోకి వెళ్లాలంటే రాప్తాడు రైల్వే గేటు తప్పనిసరిగా దాటాల్సి ఉంటుంది. అలాగే చెన్నై రహదారి నుంచి వచ్చే వాహనాలు బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు వెళ్లాలంటే ఈ గేటు దాటుకుని వెళ్లాలి. లారీలు, బస్సులు, పెద్ద లగేజి వాహనాలు, ఇతర వాహనాలు ఈ రైల్వే గేటు దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. రైలు



గేటు వేయడంతో వాహనదారుల నిరీక్షణ

వచ్చే సమయంలో గేటు వేసినప్పుడు వాహనాలు పదుల సంఖ్యలో ఇరువైపులా నిలబడి ట్రాఫిక్ జాం అవుతూ ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం రైల్వే గేటుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటూ అండర్ గ్రౌండ్ దారి నిర్మించడానికి రూ. 73.92 కోట్లు నిధులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2019లో నిర్మాణ పనులు ప్రారంభించి 2020లోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టరు సకాలంలో పనులు పూర్తి చేయలేదు. దీంతో వాహ నదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు.

అండర్ గ్రౌండ్ పనులూ పూర్తి కాలేదు

రైల్వే ట్రాక్‌పై వంతెన నిర్మాణం, ఇరువైపులా అండర్ గ్రౌండ్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాల్సి ఉంది. వంతెన పనులు 75 శాతం పనులు పూర్తి చేశారు. అండర్ గ్రౌండ్ నిర్మాణ పనులు కేవలం దాదాపు 30 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. అండర్ గ్రౌండ్ పనులు పూర్తయి ఉంటే ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర చిన్న వాహనాలు ఆ దారి ద్వారా వెళ్లేవి. అండర్ గ్రౌండ్ పనులు కూడా పూర్తి కాకపోవడంతో గేటు వేసినప్పుడల్లా వాహనాలు అధిక సంఖ్యలో వేచి ఉండాల్సి వస్తోంది. వంతెన కింద వాహనాలు వెళ్లే దారి గుంతలు, బురదమయంగా ఉండేది. గుంతల దారిలే వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది పడేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18న రాప్తాడులో సిద్ధం సభ నిర్వహించినప్పుడు అప్పటి ముఖ్య మంత్రి వస్తుండటంతో అక్కడ తారురోడ్డు నిర్మిం చడంతో వాహనదారులు కొంత ఉపశమనం పొందారు. ఈ సమస్యపై సంబందిత అధికారులను సంప్రదించగా.. మొదట తమిళనాడుకు చెందిన కాంట్రాక్టర్ పనులు చేపట్టాడని బిల్లులు సక్రమంగా రాకపోవడంతో పనులు నిలిపివేశాడని, మిగతా పనులు పూర్తి చేసేందుకు రీ టెండర్లు పిలిచి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీతోనే మహిళలకు రక్షణ



అనంతపురంలో మీడియాతో మాట్లాడుతున్న స్వప్న



సీకేపీలో మాట్లాడుతున్న తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, జూన్ 23: టీడీపీతోనే మహిళలకు రక్షణ ఉంటుందని అనంతపురం నగర పాలక సంస్థ మాజీ మేయర్ స్వరూప పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... చీరాల మండలం ఈపురుపాలెంలో యువతి సుచరితపై అల్లరిమూకలు అత్యాచారం చేయడాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత సీరియస్‌గా తీసుకున్నారన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు హోం మంత్రి స్వ యంగా ప్రగాఢ సానుభూతిని తెలపడంతోపాటు దుండగు లను 48 గంటల్లోగా పట్టుకొని, శిక్షించాలని హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఘటన జరిగిన 36 గంటల్లోనే పోలీసులు నిందితులను అరెస్టు చేశారన్నారు. బాధితు రాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసిందన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై హోం మంత్రి ఉక్కుపాదం మోప డంతో పాటు మహిళలకు రక్షణ కల్పించేం దుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. వైసీపీ హయాంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బాధితులకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. మహి ళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుం టున్న సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనితకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



స్వరూప

ఇకపై మహిళల జోలికొస్తే...

మహిళల జోలికొస్తే సీఎం చం ద్రబాబు అంతుచూస్తారని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి స్వప్న హెచ్చ రించారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనం తపురం అర్బన్ టీడీపీ కార్యా లయంలో తెలుగు మహిళలు కంఠాదేవి, మహేశ్వరి, సుమలత, పద్మావతిలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. చీరాల మండలం ఈపురు పాలెంలో యువతిపై మద్యం మత్తులో అత్యాచారం, హత్య చేసిన వారిని 36 గంటల్లోనే పట్టుకునేలా హోంమంత్రి అనిత చర్యలు తీసుకోవడం అభినందనీ యమన్నారు. వైసీపీ హయాంలో మహిళలపై అనేక అఘాయి త్యాలు జరిగాయని, ఒక్క బాధితురాలికి కూడా అప్పటి పాలకులు న్యా యం చేయలేదని దుయ్యబట్టారు. మహిళ లకు రక్షణ కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనితకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: మహిళలపై రాష్ట్రంలో ఎవరైన అఘాయిత్యాలకు పాల్పడాలని చూ సే ఉన్మాదులపై టీడీపీ ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని... అందుకు ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపురపాలెం సంఘ టనే నిదర్శనమని సత్యసాయి జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆమె తెలుగు మహిళలతో కలిసి మాట్లాడారు.

కేవలం 36 గంటల్లోనే నింది తులను అరెస్ట్ చేసేలా సీఎం చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనిత కృషి చేయ డం అభినందనీయమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై ఎన్ని అఘాయి త్యాలు జరిగినా.. అప్పటి సీఎం కానీ హోంమంత్రి కానీ స్పందించిన దాఖలాలు లేవన్నారు. టీడీపీతోనే మహిళలకు పూర్తి రక్షణ ఉంటుందన డానికే ఇదే నిదర్శన మన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు వరలక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోనలో ఆరాధనోత్సవం

చెన్నేకొత్తపల్లి, జూన్ 23: చెన్నేకొత్తపల్లికి సమీపంలోని కోన కణ్వాశ్రమంలో సోమవారం అంజనాదేవి 47వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ మల్లికార్జునస్వామి కణ్వాశ్రమ ఆలయ కమిటి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపూజ, గంగపూజ, ధ్వజారోహణం, అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ప్రత్యేక భజన ఉంటుందన్నారు. అదేవిధంగా మంగళవారం తెల్లవారుజామున ఆశ్రమంలో అమ్మవారి ఉత్సవ ఊరేగింపు, విష్ణుసహస్ర పారాయణం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

20 మందిపై కేసు

గార్లదిన్నె : మండలంలోని కల్లూరు ఆగ్రహారం గ్రామంలో జరిగిన ఘర్షణలో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహహమ్మద్‌గౌస్ తెలిపారు. తోపుదుర్తికి చెందిన రాజశేఖర్ ఆగ్రహారంలో ఉన్న బంధువు హనుమంతు ఇంటికి శనివారం వచ్చాడు. రాజశేఖర్‌కు దగ్గర బంధువులైన ప్రభాకర్, కుమార్తె అనుషతో శనివారం రాత్రి ఇరువురికి చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రాజశేఖర్ తరుపున తోపుదుర్తి గ్రామం నుంచి సుమారు 10 మంది వాహనాల్లో కల్లూరుకు వచ్చి ప్రభాకర్, కుమార్తె అనుషతో గొడవ పడ్డారు. ఈ గొడవలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలకు చెందిన సుమారు 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

రాప్తాడు, జూన్ 23: మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు కృష్ణమరాజు (37) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను తన రెండు కాళ్లూ కోల్పోయాడు. రబ్బరు కాళ్లు అమర్చుకుని జీవనం సాగించేవాడు. అతనికి భార్య లక్ష్మీ, ఒక కుమారుడు, ఒక కూతురు. కుటుంబ పోషణ భారమై తీవ్ర మనస్థాపం చెందిన అతను ఆదివారం జంగాలపల్లి, ప్రసన్నాయపల్లి స్టేషన్‌ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతని మృతదేహం పూర్తిగా నుజ్జు నుజ్జ అయిందని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్షణికావేశంలో యువతి ఆత్మహత్య

బుక్కరాయసముద్రం : తల్లిదండ్రులు మందలించారనే క్షణికావేశంలో ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రేగడికొత్తూరు గ్రామానికి చెందిన భాగేశ్వర్‌రెడ్డి, భవానీలకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె పేరు నవ్యశ్రీ (16). ఆదివారం ఓ చిన్న విషయమై తల్లిదండ్రులు నవ్యశ్రీని మందలించారు. క్షణికావేశంతో ఆమె ఇంటి సమీపంలో ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి.. ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సేపు అనంతరం గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థులకు అన్యాయం

అనంతపురం న్యూటౌన్ : నీట్ పేపర్ లీకేజ్‌తో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే తగిన నిర్ణయం తీసుకొని వారిని ఆదుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు పేపర్ లీకేజ్ మాఫియా చేతిలో చిక్కి నాశనం అవుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగు తున్నా... ప్రధాని మోడీ స్పందించకపోవడం దారుణమన్నారు.

నీట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 23: నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) నాయకులు విమర్శించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యద ర్శులు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం మాట్లాడుతూ... నీట్ పరీక్షల్లో పేపర్ లీక్ కావడం, గ్రేస్ మార్కులు కలపడంతో 24లక్షల మంది విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేశారని విమర్శించారు. వెంటనే ఎన్‌టీఏను రద్దు చేసి, లీకేజీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మెడికల్



టవర్‌క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఈసీ నాయకులు

సీట్లలో ప్రవేశాలను నేషనల్ మెడికల్ కౌన్సిల్ ద్వారా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అధికారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, ఇలాంటి దుష్పరిణామాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ నాయకులు నాగరాజు, నీలకంఠశరణ్య, సురేష్, చరణ్‌రాజ్, చంద్రిమ, గౌసియా, పద్మావతి, గౌతమి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాజమోహన్

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు

అనంతపురం కల్చరల్, జూన్ 23: స్థానిక నేతాజీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో సీనియర్స్ విభాగంలో సెయింట్ అగస్టిన్ స్కూల్‌కు చెందిన అరిబా ఆలం, జూనియర్స్ విభాగంలో ప్రతిభ హైస్కూల్‌కు చెందిన సింధు ప్రథమస్థానాల్లో గెలుపొందారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజీ రాజమోహన్ మాట్లాడారు. విద్యార్థి దశలోనే ప్రతిఒక్కరూ విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, అపుడే సమాజాన్ని జాగ్రత్త పరిచేలా ముందడుగు వేయగలమని అన్నారు. విద్యార్థులు న్యూస్‌పేపర్లు, వివిధ సబ్జెక్టుల పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో లేని సబ్జెక్టులను చదివేందుకు రోజుకు కనీసం అరగంట సమయం కేటాయించాలన్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి విషయాన్ని తోటివారితో విచారించడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కోకన్వీనర్ ఎంఎస్‌టి రాజు, రసూల్, చంద్రశేఖర్, మధు, రవి పాల్గొన్నారు.

ముష్కిన్ మరణం తీరనిలోటు: సీపీఎం

అనంతపురం కల్చరల్, జూన్ 23 : సీపీఎం అనుబంధ ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముష్కిన్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. ముష్కిన్ ఆదివారం ఉదయం మార్కెట్ యార్డులో ఉన్న సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. భౌతిక కాయాన్ని సోములదొడ్డిలోని ఆయన నివాసానికి తరలించారు. సాయంత్రం సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు పెద్దఎత్తున్న అక్కడికి చేరుకుని, ముష్కిన్ భౌతిక కాయానికి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... ముష్కిన్ ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నో ఉద్యమాలను నడిపి ఎన్ఆర్‌సీ, సీఏఏ చట్టాలకు మైనార్టీలందరినీ ఐక్యం చేసి, బీజేపీ తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం సాగించారన్నారు. పేద కుటుంబంలో జన్మించిన ముష్కిన్... ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరా టాలు చేశాడని గుర్తుచేశారు. కరువుజిల్లా అనంతపు రంలో ఖుద్రేముఖ్ ఇనుప ఫ్యాక్టరీ నిర్మించాలని డి.హిరేహాల్ నుంచి చేపట్టి న పాదయాత్రలో ముష్కిన్ చురుగ్గా పాల్గొన్నాడని తెలిపారు. రైతులు, రైతుకూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పాదయా త్రలో ఆయన ముందుండి నడిచాడన్నారు. ఇంతటి పోరాటయోధుడిని కోల్పోవడం సీపీఎంకు తీవ్ర లోటని పేర్కొన్నారు. అనంతరం సోముల దొడ్డిలోని కబరస్తాన్‌లో ముష్కిన్ భౌతికకాయానికి ముస్లిం సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర కుమార్, శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు చంద్ర శేఖర్, రామాంజినేయులు, సీపీఐ నాయకులు శ్రీరాములు, జాఫర్, ముస్లీం మైనార్టీ నాయకులు నదీం, మునాఫ్, రజాక్, డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ ప్రసూన, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, మసూద్, వలి, ముర్తుజా, గోపాల్, వెంకటనారాయణ పాల్గొన్నారు.



ముష్కిన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మారెదెప్పుడో?

- సంక్షోభంలో ఎస్సీ సంక్షేమ హాస్టల్
- అరకొర వసతులతో విద్యార్థుల అవస్థ
- వసతి గృహాన్ని పట్టించుకోని వార్డెన్
- హాస్టల్‌లో తాండవిస్తున్న అపరిశుభ్రత
- కలెక్టర్ తనిఖీతోనైనా మారేనా?


ఎస్సీ సంక్షేమ హాస్టల్

తాడిపత్రిటౌన్, జూన్ 23: పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న ఎస్సీ హాస్టల్ అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 6నుంచి 10వ తరగతి విద్యార్థులు 46మంది, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ విద్యార్థులు 54మంది ఈ హాస్టల్‌లో వసతి పొందుతున్నారు. వీరికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిధులు మంజూరు చేసింది. అయితే అధికారుల తనిఖీలు లేకపోవడంతో వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, తాగునీరు, నాణ్యమైన భోజనం కరువయ్యాయి. అయితే ఇవేవి తనకు పట్టవన్నట్లు వార్డెన్ వ్యవహరిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎక్కడ చూసినా అపరిశుభ్రత


పాచిపట్టిన వాటర్‌ట్యాంక్

హాస్టల్‌లో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది. అసలే వర్షాకాలం కావడంతో దోమలు ఉధృతమయ్యాయి. హాస్టల్‌లోని కొన్ని గదులకు కిటికీలు లేకపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. దీంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. నీటి ట్యాంక్‌లో పురుగులు తేలియాడుతుండటంతో స్నానం చేయాలంటే విద్యార్థులు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మొక్కుబడిగా స్నానం చేస్తూ పాఠశాలలకు వెళుతున్నారు. అపరిశుభ్ర నీటితో స్థానం చేయడం వల్ల విద్యార్థులకు చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. హాస్టల్ ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషపురుగులు వస్తాయన్న భయంతో విద్యార్థులు గడుపుతున్నారు.


కిటికీలు లేని గదులు

విధుల్లో వార్డెన్ అలసత్వం

హాస్టల్‌లోనే నిత్యం ఉంటూ విద్యార్థుల బాగోగులు చూసుకోవాల్సిన వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. కనీస వసతి సౌకర్యాలు కల్పించకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకుండా, విధులకు అప్పుడప్పుడు మాత్రమే వస్తున్నట్లు సమాచారం. బుక్కరాయసముద్రం హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేసినప్పుడు కూడా ఈయన తీరు ఇలాగే ఉండేదని సమాచారం. నాలుగురోజుల కిందట కలెక్టర్ వినోద్‌కుమార్ హాస్టల్ తనిఖీకి వచ్చిన సమయంలో వార్డెన్ లేకపోవడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. వార్డెన్‌ను పిలిపించాలని కలెక్టర్ ఆదేశించడంతో అధికారులు ఫోన్‌చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మరింత ఆగ్రహించిన కలెక్టర్ విధుల సమయంలో వార్డెన్ ఎక్కడికి వెళ్లినట్లు మరి మీరేమి చేస్తున్నారు అంటూ అధికారులకు చీవాట్లు పెట్టారు. వార్డెన్‌కు నోటీసు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.


అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

వార్డెన్ గురించి మా దృష్టికి రాలేదు:

ఫక్కీరయ్య, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్

ఎస్సీ హాస్టల్ వార్డెన్ గురించి వస్తున్న ఆరోపణలు మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారిస్తాం. ఇప్పటివరకు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు నేరుగా నావద్దకు తీసుకురావచ్చు. హాస్టల్‌లో ఉన్న చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

ద్విచక్రవాహనం బోల్తా-ఒకరికి గాయాలు

గుత్తిరూరల్, జూన్ 23: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనం బోల్తా పడటంతో లక్ష్మయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాచుపల్లికి చెందిన లక్ష్మయ్య ద్విచక్రవాహనంలో గుత్తికి వస్తుండగా గ్రామ శివారులో ద్విచక్రవాహనం బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మరో ఇద్దరికి ..

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గోల్డెన్ కేఫ్ సమీపంలో ఆటోను తప్పించబోయి ద్విచక్రవాహనం బోల్తా పడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన శ్రీనివాసులు, రామాంజినేయులు ఆదివారం ద్విచక్రవాహనంలో అనంతపురం వెళ్తుండగా అనంతపురం రోడ్డులో ఓ కేఫ్ సమీపం వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి ద్విచక్రవాహన బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన వీరిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

ఎనిమిది మేకలు మృతి


మేకల కళేబరాలు

తాడిపత్రిటౌన్, జూన్23: మండలంలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన కాపరులు బాలకుళ్లాయప్ప, నాగన్నలకు చెందిన ఎనిమిది మేకలు విషపు ఆహారం తిని ఆదివారం మృతి చెందాయని బాధితులు వాపోయారు. బాలకుళ్లాయప్ప, నాగన్న దాదాపు 100గొర్రెలు, మేకలను మేపు కోసం గ్రామ సమీపంలోని దానిమ్మ తోట వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఉన్న గడ్డిని మేసిన జీవాల్లో 30 అస్వస్థతకు గురయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి ఖాదర్‌బాషా జీవాలను పరిశీలించి చికిత్స అందించారు. కానీ వీటిలో ఎనిమిది మేకలు మాత్రం మృత్యువాతపడ్డాయి. దీంతో దాదాపు రూ.80వేలు నష్టం వాటిల్లిందని కాపరులు ఆవేదన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎంసీ రామకృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతిచెందిన మేకలను పరిశీలించారు. ఆదుకుంటామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.

రోడ్డు ఏర్పాటు


సొంతనిధులతో మట్టిని వేస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూన్ 23: మండలంలోని కణేకల్లు-మాల్యం గ్రామాల మధ్య ఉన్న వేదావతిహగరిలో టీడీపీ నాయకులు మట్టితోలి రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో మాల్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ప్రభాకర్, కిష్టప్ప, కురుబ హరి, వండ్ర, గురు, కృష్ణారెడ్డి, సూరి, మాబు, శ్రీరామ్, మారెన్న, నాగరాజు, ఎల్లప్ప తదితరులు ట్రాక్టర్లతో మట్టిని తోలించి జేసీబీతో చదును చేయించి వాహన రాకపోకలకు మార్గాన్ని సుగమనం చేశారు.

గుంతలను పూడ్పించిన టీడీపీ నాయకులు


రోడ్డుపై మట్టిని వేయిస్తున్న టీడీపీ నాయకులు

కూడేరు, జూన్ 23: మండలంలోని ఉదిరిపికొండ తండా నుంచి శివరాంపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని టీడీపీ నాయకులు బాగు చేయడానికి ఆదివారం పూనుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాదాపు 150 ట్రాక్టర్ల మట్టితో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చారు. దాదాపు నాలుగు కిలోమీటర్లు వరకు మంటితో గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో స్థానికులు వారిని అభినందించారు.

ఆడ పిల్లల చదువే అభయ విద్యానిధి లక్ష్యం


విద్యార్థినులకు నగదును అందజేస్తున్న సంస్థ సభ్యులు

గుంతకల్లుటౌన్, జూన్ 23: ఆడ పిల్లల చదువే తమ లక్ష్యమని అభయ విద్యానిధి సంస్థ వ్యవస్థాపకురాలు, చైర్మన్ వసుంధర దేవి, అధ్యక్షురాలు మాధవిలత పేర్కొన్నారు. స్థానిక రోటరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం అభయ విద్యానిధి సంస్థ వార్షిక ప్రగతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, లక్ష్మీబాలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు కోసం ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వసుంధరదేవి, మాధవిలత ఈ ఏడాది విద్యార్థినులకు అందించిన ఆర్థిక సాయాన్ని వివరించారు.

పింఛన్ పెంపు హర్షణీయం

గుత్తి, జూన్ 23: రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు దివ్యాంగుల పింఛన్‌ను రూ. 3వేల నుంచి రూ. 6వేలకు పెంచడం పట్ల ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సునీత హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గుంతకల్లు రోడ్డులో ఆదివారం ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం భారత ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పద్మావతి, సంజమ్మ, లక్ష్మీదేవి, నూర్జహాన్, రాముడు, శ్రీనివాసులు, రామాంజినమ్మ, రమేష్, సంజప్ప పాల్గొన్నారు.


కూటమి నేతలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ముగిసిన ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రిటౌన్, జూన్23: పట్టణంలోని సంజీవనగర్ మొదటిరోడ్డులో ఉన్న వేదమాత గాయత్రీదేవి అమరలింగేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న 9వ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి, అమరలింగేశ్వరుడికి అర్చనలు, అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు హోమాది కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ



తైక్వాండో పోటీల్లో విజేతగా నిలిచిన మన్విత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కూడేరు, జూన్ 23: మండలంలోని పి. నారాయణపురం గ్రామానికి చెందిన మకర మన్విత్ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపాడు. అండర్- 35 కేజీల విభాగంలో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఆదివారం అనంతపురం నగరంలో నిర్వహించిన జిల్లా ఓపెన్ తైక్వాండో పోటీల్లో ఏడో తరగతి చదువుతున్న మకర మన్విత్ పాల్గొని విజేతగా నిలిచాడు. స్కూల్ కరస్పాండెంట్ మధు, కోచ్ వెంకటేశులుతోపాటు తల్లిదండ్రులు ఆ బాలుడిని అభినందించారు.

సజ్జలదిన్నెలో స్వచ్ఛభారత్


మొక్కను నాటి నీరుపోస్తున్న రూరల్ సీఐ

తాడిపత్రిటౌన్, జూన్23: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు కేశవరెడ్డి, అక్కిరెడ్డిల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ సీఐ లక్ష్మికాంత్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయం సమీపంలోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. తాగునీటి సమస్యను తీర్చడంతోపాటు మురికికాలువలో పేరుకుపోయిన పూడికను తీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, గంగరాజు, సుబ్బయ్య, బాలయ్య, సుధాకర్, చంద్ర, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రితాత ఆలయంలో గోపూజ


శాంతిధామంలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

బెళుగుప్ప, జూన్ 23: మండల కేంద్రంలోని ఎర్రితాత ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆలయంలో అవదూత ఎర్రితాతకు ప్రత్యేక పూజలు, గణపతి పూజ, ధ్వజారోహణ, నంది వాహన సేవ పూజలు నిర్వహించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

పుట్లూరు, జూన్23: మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న దూదేకుల ఎర్రమ్మకి ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంఘం నాయకులు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా భార్యభర్తలకు రూ.20వేలు అందజేశారు. తమ సంస్థ నిరుపేదలకు చేదోడువాదోడుగా ఉంటుందని తెలిపారు. అధ్యక్షుడు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, గౌరవ అధ్యక్షుడు హరి, కన్వీనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంత్రిని కోరిన ఆర్యవైశ్యులు


మంత్రిని శాలువాలతో సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

కళ్యాణదుర్గం, జూన్ 23: తమ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్‌ను కోరినట్లు పలువురు ఆర్యవైశ్యులు తెలిపారు. సమస్యలు విన్నవించడానికి కర్నూలులో మంత్రిని ఆదివారం కలిసినట్లు కళ్యాణదుర్గం ఆర్యవైశ్యసంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యసంఘం నాయకులు మంత్రికి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తమ సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయం విశ్వనాద్, కార్యదర్శి వాసు, గోపీనాథ్, యువజన సంఘం అధ్యక్షులు సందీప్, ఈశ్వర్, కార్తీక్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు టోర్నీ విజేత బళ్లారి జట్టు

కణేకల్లు, జూన్ 23: మండల కేంద్రంలో గత 20 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీని బళ్లారి జట్టు కైవసం చేసుకుంది. తమతో పాటు క్రికెట్ ఆడుతూ అనారోగ్య కారణాలతో చనిపోయిన ఇర్ఫాన్, రవీంద్ర, వైటీఎస్ రముల జ్ఞాపకార్థం వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించగా ఆదివారం కణేకల్లు-బళ్లారి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది.

అమరవీరుడికి ఘన నివాళి


శ్రీనివాసులు తల్లిని సన్మానిస్తున్న దృశ్యం

బెళుగుప్ప, జూన్ 23: దేశ రక్షణలో భాగంగా ప్రాణ త్యాగం చేసిన సీఆర్‌పీఎఫ్ జవాన్ డి శ్రీనివాసులుకు ఆదివారం మండలంలో ఎర్రగుడిలో ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ సీఆర్‌పీఎఫ్‌లో పని చేస్తున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డి గ్రామానికి వచ్చి నివాళులర్పించారు. శ్రీనివాసులు 1997 జూన్ 23న అస్సోంలో తీవ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పులో వీరమరణం పొందిన విషయం తెలిసిందే. అసువులు బాసిన జవాను త్యాగనిరతిని కొనియాడుతూ వీర జవాన్ స్వగ్రామంలో తల్లి డబ్బర నారాయణమ్మను సత్కరించి కుటుంబసభ్యులతో కలిసి సంతాపం తెలిపారు. సంతాప సభలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ దగ్ధం

విడపనకల్లు, జూన్ 23: మండలంలోని అంచనహాలు గ్రామం వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ దగ్ధం అయ్యింది. విడపనకల్లు పోలీసులు తెలిపిన మేరకు ఆదివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో గుంతకల్లు నుంచి బళ్లారికి 67వ జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ అంచనహాలు గ్రామం పెద్ద వంక వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి బ్రిడ్జిని ఢీ కొట్టింది. దీంతో డీజిల్ ట్యాంక్‌లో మంటలు చెలరేగి లారీ మొత్తానికి వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ శ్రీనివాసులు లారీ నుంచి కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. విషయం తెలుసుకున్న అంచనహాలు గ్రామస్థులు గుంతకల్లు అగ్నిమాక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు. అప్పటికే లారీ మొత్తం కాలిపోయింది. ఈ విషయమై విడపనకల్లు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మంటల్లో కాలిపోతున్న లారీ

వైద్యం కోసం ఆర్థికసాయం

యల్లనూరు, జూన్23: మండలంలోని చిలమకూరు గ్రామానికి చెందిన ప్రణతి వైద్య ఖర్చుల కోసం రూ.ఐదు వేలును ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున ఆదివారం అందజేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 20న ప్రచురితమైన ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న చిన్నారి అనే వార్తకు స్పందిస్తూ పల్నాడు జిల్లా గురజాలకు చెందిన ఎన్టీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తన్నేటి పున్నయ్య, సభ్యులు చాగంటి బ్రహ్మం, రామకృష్ణ ఫోన్‌పే ద్వారా ఆర్థికసాయం చేసినట్లు ప్రణతి తండ్రి గంగరాజు తెలిపారు. ఫోన్ ద్వారా ప్రణతి ఆరోగ్య పరిస్థితులను వారు అడిగినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రణతి హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తండ్రి తెలిపారు.

ముఖర్జీకి ఘన నివాళి

భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి బీజేపీ కార్యకర్త శ్యాంప్రసాద్ ముఖర్జీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుత్తి: ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


గుంతకల్లు టౌన్‌లో నివాళి


తాడిపత్రి టౌన్: నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


కుందుర్పి: ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పుట్లూరు, జూన్23: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో రామాంజనేయులు (35) ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు రామాంజనేయులు ఐదేళ్ల నుంచి బెలుగుప్ప మండలం కాలువపల్లి గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. భార్యకు పిల్లలు పుట్టలేదని పలు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించాడు. అయినా ఫలితం లేకపోయింది. వైద్యం కోసం అప్పులు ఎక్కువచేయడంతో తీర్చలేక ఆదివారం సొంత ఊరు ఎల్లుట్లకు వచ్చి ఇంటిలోని సూపర్‌వాస్మోల్ తాగాడు. మళ్లీ ఇంటిలోనే ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి


నీటి కోసం కొళాయి వద్ద ఉంచిన బిందెలు

కుందుర్పి, జూన్ 23: మోటార్లు కాలిపోవడంతో పేదల దాహార్తిని తీర్చే శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా గత 20 రోజుల నుంచి ఆగిపోయింది. దీంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. మండల వ్యాప్తం గా అధిక శాతం ఫ్లోరైడ్ వాటర్ ఉండటంతో ప్రజలకు శ్రీరామరెడ్డి నీళ్లే దిక్కయ్యాయి. ఇప్పుడు అవి కూడా రాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం పొలాల బాట పడుతున్నారు. అయితే శ్రీరామిరెడ్డి నీటి యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు మోటార్లు రిపేరీ చేయించి గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.